క్లుప్తంగా

తాడికొండ పంచాయతీలో డీఎల్‌పీవో తనిఖీ!

తాడికొండ: తాడికొండ పంచాయతీని గురువారం డీఎల్‌పీవో కె.శ్రీనివాసరావు సందర్శించారు. స్థానికంగా పన్ను వసూళ్లలో అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు పరిశీలన నిమిత్తం పంచాయతీకి విచ్చేసినట్లు సమాచారం. సచివాలయ సిబ్బందితో సమావేశమైన ఆయన పలు అంశాలపై చర్చించారు. బిల్లు పుస్తకాల్లో సక్రమంగా వసూలు చేసిన నగదును జమచేయలేదనే ఫిర్యాదుల మేరకు ఆయన తనిఖీ చేసినట్లు తెలుస్తోంది. కార్యదర్శి రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సెంట్రల్ నర్సరీ నిర్వహణకు నూతన వాహనాలు



తాడికొండ: సీఆర్డీఏ.. అమరావతిలోని ఉద్దండరాయునిపాలెంలో 20 ఎకరాల్లో విస్తరించిన సీఆర్డీఏ సెంట్రల్ నర్సరీ, అవెన్యూ మొక్కల పెంపకం నిర్వహణకు నూతన వాహనాలను అందజేసింది. నర్సరీ నిర్వహణ నిమిత్తం 47 హెచ్‌పీ ట్రాక్టర్, వాటర్ ట్యాంకర్, ట్రైలర్‌ను తాజాగా సీఆర్డీఏ కొనుగోలు చేసింది. ఈ మేరకు కమిషనర్ కె.కన్నబాబు చేతుల మీదుగా సంబంధిత అధికారులకు వాహనాల తాళాలు అందజేశారు. కార్యక్రమంలో సీఆర్డీఏ ల్యాండ్ స్కేప్ – ఎన్విరాన్‌మెంట్(ఎల్ఎస్ఈ) విభాగ అడిషనల్ డైరెక్టర్ ఎం.హరిప్రసాద్-హార్టికల్చర్(ఎఫ్ఏసీ), డెప్యూటీ డైరెక్టర్ బి.జాన్ బెన్నీ, హార్టికల్చర్ అధికారి శివరామకృష్ణ పాల్గొన్నారు.

దీక్షలు జయప్రదం చేయండి

దుగ్గిరాల: రాష్ట్రంలో వ్యవసాయాన్ని 80 శాతం మంది కౌలు రైతులు, సన్నకారు రైతులే పంట సాగు చేస్తున్నారని, కౌలు రైతు సంఘాల పోరాట ఫలితంగా 2011లో ఉన్న కౌలు రైతు రక్షణ చట్టం 2011 రద్దు చేయడంతో కౌలు రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వరరావు తెలిపారు. దుగ్గిరాల మండలం చిలువూరులో గ్రామ మహాసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కౌలు రైతుల హక్కుల రక్షణకు 13, 14 తేదీల్లో దీక్షలు చేపడుతున్నట్లు దానిలో భాగంగా 13న దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయం వద్ద దీక్ష చేయనున్నటు జయప్రదం చేయాలని కోరారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకొన్నారు. గ్రామ అధ్యక్షుడిగా ఎం.అంజియ్య ఎన్నికయ్యారు. జెట్టి బాలరాజు, శ్రీను, వీరయ్య, గోపాలరావు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు లేకుంటే జరిమానా



ఫిరంగిపురం: వాహనచోదకులు తప్పనిసరిగా తమ వెంట ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని సీఐ శివరామకృష్ణ అన్నారు. మండల శివారులోని పెట్రోలు బంకు సమీపంలో గురువారం వాహనాల తనిఖీలు చేశారు. వాహన లైసెన్సు, ఇన్సూరెన్స్, పొల్యూషన్ వంటి ధ్రువపత్రాలు లేకుంటే జరిమానా విధించక తప్పదని హెచ్చరించారు. వాహనాలు తనిఖీలు చేసి సరైన ధ్రువపత్రాలు లేని వాహనాల యజమానులకు జరిమానా విధించారు. ఆయన వెంట ఎస్ఐ బి.శ్రీనివాసరావు, ఏఎస్ఐ పఠాన్ జాన్‌ఖాన్, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన ఆటోడ్రైవర్‌కు రిమాండ్

మంగళగిరి టౌన్: మద్యం మత్తులో అతివేగంగా వాహనాన్ని నడిపి ఓ వ్యక్తి మృతికి కారణమైన ఆటోడ్రైవర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు మంగళగిరి రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకట్ తెలిపారు. మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎస్ఐ వెంకట్ మాట్లాడుతూ ఈనెల 7వ తేదీ రాత్రి మంగళగిరి మండలం నవులూరులో ఆటోడ్రైవర్ గమల్లపల్లి రాంబాబు మద్యం సేవించి తన టాటా మేజిక్ ఆటోను నడుపుతూ పలువురిని ఢీకొని వెళ్లాడు. రోడ్డు వెంట ఇతరులతో మాట్లాడుతున్న పున్న శంకరరావు అనే వ్యక్తిని ఢీకొట్టాడు. ఘటనలో శంకరరావుకు తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి నిందితుడు రాంబాబును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, నిందితుడికి మంగళగిరి కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది.

ఉచిత వైద్య సేవలు



తాడేపల్లి రూరల్: చిర్రావూరులో వాసన సీతారామమ్మ, అంజయ్య మెమోరియల్ ట్రస్ట్, అనురాగ్ హెల్త్‌కేర్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్యశిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈగ్రామ టీడీపీ అధ్యక్షులు కాసరగడ్డ శ్రీనివాసరావు మాట్లాడుతూ సుమారు 100 మందికి పరీక్షలు చేసినట్లు తెలిపారు. అనురాగ్ హెల్త్‌కేర్ ఎండీ డాక్టర్ వి. నాగ మల్లేశ్వరరావు, ఎండీ, డీఎం కార్డియాలజీ వైద్యులు సాయిప్రసాద్, డాక్టర్ లీనా, డాక్టర్ అతిర పాల్గొన్నారు.

అద్దె భవనాలు.. అరకొర వసతులు

- 'మంగళగిరి'లో అంగన్‌వాడీ కేంద్రాలు
- 238 కేంద్రాలకు 101 సొంత భవనాలు
- ఇరుకు గదుల్లో చిన్నారులకు చదువు

మంగళగిరి టౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులు అరకొరగా ఉంటున్నాయి. ఎక్కువగా అద్దె భవనాలు కావడంతో ఇబ్బందులు తప్పడం లేదు. చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతల కోసం పనిచేయాల్సిన అంగన్‌వాడీలు డీలాపడుతున్నాయి. చాలా కేంద్రాలకు సొంత భవనాలు లేక అద్దె ఇళ్లల్లో, ఇరుకు గదుల్లో నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. కొన్ని అద్దె భవనాల్లో మౌలిక వసతులు కానరావడం లేదు. గత వైఎస్సార్ సీపీ హయాంలో మంగళగిరి, దుగ్గిరాల, తాడేపల్లి మండలాల్లో కొన్ని కొత్త భవనాలు మంజూరు చేశారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ అమలులోకి రావడం.. ఏర్పాటైన కూటమి సర్కారు వీటిపై కనీస ఆలోచన చేయలేదు. దీంతో నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి.

మంగళగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో..

మంగళగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో మంగళగిరి, దుగ్గిరాల, తాడేపల్లి మండలాల్లో మొత్తం 238 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అందులో సొంత భవనాలు 101, అద్దె భవనాలు 116, ఉచిత భవనాలు 21 ఉన్నాయి. మూడు మండలాల్లో గర్భిణులు 1,694 మంది, బాలింతలు 1,135 మంది ఉన్నారు. 6 నెలలలోపు చిన్నారులు 1,137 మంది, 6నెలల నుండి ఏడాది లోపు పిల్లలు 1,804 మంది, 1 నుంచి మూడేళ్లలోపు చిన్నారులు 6,927, 3 నుంచి ఏడేళ్ల లోపు చిన్నారులు 8,388 మంది ఉన్నారు. దాదాపు చాలా కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. పలు కేంద్రాల్లో చిన్న అద్దెగదుల్లోనే చిన్నారులకు విద్యను అందించడం, వంట సామగ్రి భద్రపరచడం, అక్కడే వంట, పాలు, గుడ్లు, ఇతర పౌష్టికాహారం ఉంచడం వంటి పనులన్నీ ఒకేచోట నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో అద్దె గదుల్లో నిర్వహిస్తున్న కేంద్రాలకు పిల్లలను పంపడానికి, గర్భిణులు రావడానికి నిరాసక్తత చూపుతున్నారు.



అద్దె భవనాల్లో ఆడుకుంటున్న చిన్నారులు

అద్దె రూపంలో వేలాది రూపాయలు...

అంగన్‌వాడీ పిల్లలను ఆకర్షించేందుకు అనేక రకాల వసతులతో పాటు సొంత భవనాలుకూడా అవసరం. పిల్లలకు మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడగా, అటు అద్దెరూపంలో వేలాది రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. దీంతో పిల్లల డ్రాప్ అవుట్‌లు పెరుగుతున్నాయి. సంబంధిత జిల్లా అధికారులు సొంత భవనాలపై శ్రద్ధ చూపి అన్నిరకాల వసతులు కల్పించి అంగన్‌వాడీ సెంటర్లను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



మంగళగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం

ప్రతిపాదనలు పంపించాం



అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ, ప్రైమరీ విద్యతో పాటు అన్నిరకాల వసతులు కల్పిస్తున్నాం. చిన్నారులను ఆకర్షించడానికి ప్రత్యేక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నాం. పిల్లలకు అన్ని సౌకర్యాలు ఉండటానికి అద్దె భవనాలు తీసుకుంటున్నాం. మంగళగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో సొంత భవనాల ఏర్పాటుకు అధికారులకు నివేదికలు అందించాం.

–సరిత, సీడీపీవో, మంగళగిరి

రెండు నెలల పెండింగ్ జీతాలు చెల్లించండి

కార్మికుల నిరసన

తాడికొండ: పెండింగ్‌లో ఉంచిన రెండు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని రాజధాని పారిశుద్ధ్య కార్మికులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పని విరామ సమయంలో పలు గ్రామాల్లో వారు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రాజధాని పారిశుద్ధ్య కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు ఎం.రవి మాట్లాడుతూ పెండింగ్ జీతాల కోసం ఆందోళన చేయడం, ఆ తర్వాతనే అధికారులు జీతాలు చెల్లించడం ఆనవాయితీగా మారిందని చెప్పారు. మూడో నెల జరుగుతున్నా ఇప్పటివరకు రాజధాని అమరావతి స్మార్ట్ సిటీ లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించకపోగా మీటింగ్‌ల పేరుతో వివిధ గ్రామాలలోని పారిశుద్ధ్య కార్మికులందరినీ ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ఇద్దరు కార్మికుల పని ఒక్కరి మీదే పడటంతో ఉన్న వారు కూడా పనిచేయలేక మానేసేందుకు సిద్ధమవుతున్నారన్నారు. జీతాల చెల్లింపు కోరుతూ ఈనెల 10వ తేదీ శుక్రవారం తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయం వద్ద జరిగే గ్రీవెన్స్‌లో రాజధాని పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి సామూహిక రాయబారం నిర్వహించి, అధికారులకు అర్జీ అందజేయనున్నట్లుగా తెలిపారు. నిరసనలో పలువురు కార్మిక నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

కేఎల్‌యూలో ఫ్లెక్సిబుల్ ఎలక్ట్రానిక్స్‌లో ఎక్సలెన్స్ సెంటర్

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలోని ఈసీఈ విభాగంలోని ఫ్లెక్సిబుల్ ఎలక్ట్రానిక్స్ లేబొరేటరీని 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఫ్లెక్సిబుల్ ఎలక్ట్రానిక్స్'గా అప్‌గ్రేడ్ చేసినట్లు వర్సిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేఎల్‌యూ, మలేషియాలోని యూనివర్సిటీ మలయా, కౌలాలంపూర్ మధ్య దీర్ఘకాలిక అకడమిక్ భాగస్వామ్యానికి ఇది కొత్త దశగా నిలిచిందన్నారు. ఈ సెంటర్‌ను మలేషియా కాన్సుల్ జనరల్ శరవణ కుమార్ కుమరవసగం ప్రారంభించారని, యూనివర్సిటీ మలయా నుంచి ప్రొ. డాక్టర్ వాన్ హలిజా బింటి అబ్, ఎల్డిఎంఆర్సీ హెడ్ మజిద్, ప్రొఫెసర్ థమిల్సెల్వి వెలాయుధం హాజరయ్యారని పేర్కొన్నారు. సంయుక్త పరిశోధనా బృందానికి డాక్టర్ వివేకానందన్, డాక్టర్ అరుణ్ మెహెతా కన్వీనర్లుగా వ్యవహరించారు. వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ కోనేరు లక్ష్మణ్ హవీష్ ప్రసంగించారు. అనంతరం మలేషియా కాన్సుల్ జనరల్ శరవణ కుమార్‌ను వర్శిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారధివర్మ, ప్రో వీసీలు డాక్టర్ వెంకట్‌రామ్, డాక్టర్ ఏవీఎస్‌ప్రసాద్, డాక్టర్ రాజశేఖర్ సత్కరించారు.



ఫ్లెక్సిబుల్ ఎలక్ట్రానిక్స్‌లో ఎక్సలెన్స్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న శరవణ కుమార్

జీఎస్టీ సంస్కరణలను వినియోగించుకోండి

మంగళగిరి టౌన్: జీఎస్టీ సంస్కరణల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం తగ్గింపులను అందరూ వినియోగించుకోవాలని ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని కొప్పురావు కాలనీలోని యూపీహెచ్‌సీ సెంటర్, రత్నాల చెరువు ప్రాంతాల్లో సూపర్ జీఎస్టీ- సూపర్‌సేవింగ్స్‌పై గురువారం అవగాహన కార్యక్రమాలను ఎంటీఎంసీ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనూరాధ మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యకరమైన జీవితం కోసం సాధారణ మందులపై జీఎస్టీని భారీగా తగ్గించారన్నారు. తక్కువ ఖర్చుతో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న ఉద్దేశంతో ఖరీదైన వైద్య పరీక్షలపై 12 శాతం ఉన్న జీఎస్టీని 5 శాతంగా, ఆక్సిజన్‌పై 18 శాతాన్ని 5 శాతంగా తగ్గించినట్లు తెలియజేశారు. వాహనాలు, నిత్యావసర సరుకులపై భారీగా తగ్గిన జియస్‌టిని ప్రతి కుటుంబం పొదుపు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా, అడిషనల్ కమిషనర్ శకుంతల, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్

దుగ్గిరాల: జీఎస్టీ తగ్గింపుపై అవగాహన పెంచుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. గురువారం దుగ్గిరాల మండలం రేవేంద్రపాడుల ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి గుంటూరు జిల్లా హౌసింగ్ పీడీ జి.వి.ఎస్.ఆర్.కె.వి. ప్రసాద్, మండలస్థాయి అధికారులు కలిసి జీఎస్టీ ప్రత్యేక బ్రోచర్ని ఆవిష్కరించారు.

ఫిరంగిపురం: వేములూరిపాడు హెల్త్‌వెల్‌నెస్ సెంటర్లో గురువారం సూపర్ జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎస్ అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఇటీవల ప్రకటించిన జీఎస్టీ ద్వారా వస్తువులు కొనుగోలు సమయంలో వెసలు బాటు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



జీఎస్టీ బోచర్‌ను ఆవిష్కరిస్తున్న హౌసింగ్ పీడీ ప్రసాద్, ఎంపీడీఓ శ్రీనివాసరావు

సీజేఐపై దాడిని ఖండించండి

తాడేపల్లి రూరల్: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయిపై జరిగిన దాడిని ప్రజలు, ప్రజాతంత్ర వాదులు, అభ్యుదయవాదులు ఖండించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి కోరారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో జస్టిస్ గవాయిపై జరిగిన దాడిని ఖండిస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ ఆధ్వర్యంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మనువాద భావజాలం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టులో ఒక మతోన్మాది ఆ విధంగా వ్యవహరించడం వెనుక ఆర్ఎస్ఎస్ తదితర మతతత్వ వాదులు అండ దాగుందని విమర్శించారు. భారత రాజ్యాంగానికి పెనుప్రమాదం వచ్చి పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఘటనకు కారకుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు బూరగ వెంకటేశ్వర్లు, వేముల దుర్గారావు, బి. ప్రభాకర్, వి. శాస్త్రి, ఎస్. దుర్గారావు, నరసింహారావు, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల అర్జీలు స్వీకరణ



తాడేపల్లి రూరల్: సీతానగరం బోటుయార్డు ఎదురుగా ఉంటున్న పేదల నుంచి సీపీఎం నాయకులు గురువారం అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ఎన్నికల ముందు నారా లోకేష్ పేదలకు రెండు సెంట్ల స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చారని, దాన్ని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 17వ తేదీ ఎంటీఎంసీ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో పేదలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. బోటుయార్డు వద్ద 11 ఏళ్లుగా తాత్కాలిక స్థలాల్లో అనేక ఇబ్బందులు పడుతూ ఉంటున్న పేదలకు ప్రభుత్వం న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, కేఎల్‌రావు కాలనీ కార్యదర్శి కట్టమేరి తదితరులు పాల్గొన్నారు.

అమెరికా ఆధిపత్య ధోరణిని వ్యతిరేకించాలి

మంగళగిరి టౌన్: అమెరికా ఆధిపత్య ధోరణిని వ్యతిరేకించాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని సీపీఎం కార్యాలయంలో గురువారం ట్రంప్ సుంకాలు భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం అంశంపై పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత దేశంపై విధించే సుంకాలపై, ప్రధాన మంత్రి అవలంబిస్తున్న లొంగుబాటు విధానంపై ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. విధించిన సుంకాలతో దేశంలో రొయ్యలు, చేపలు, పత్తి, వస్త్ర వ్యాపారాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు. దీంతో ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా నష్టపోతుందని తెలిపారు. మంగళగిరిలో నారా లోకేష్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. దీనిపై ఈనెల 17న ఎంటీఎంసీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని, దీనికి పేదలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వ్యవస్థల్లో ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్నవారు ఉన్నారన్నారు. ఇలాంటి తరుణంలో భారత రాజ్యాంగానికి, న్యాయవ్యవస్థకు తూట్లు పొడిచేందుకు బీజేపీ చూస్తోందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఓట్ల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టాలని మోదీ ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఇళ్ల స్థలాలు, పట్టాల కోసం ఈనెల 13,14,15 తేదీల్లో కార్పొరేషన్ కార్యాలయం వద్ద రిలే దీక్షలు జరుగుతాయని తెలియజేశారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, పట్టణ కార్యదర్శి వీవీ జవహర్‌లాల్, జేవీ రాఘవులు, పిల్లలమర్రి బాలకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

సంపూర్ణ పారిశుద్ధ్యానికి చర్యలు

తాడికొండ: గ్రామాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం దిశగా తగిన చర్యలు తీసుకోవాలని తాడికొండ ఎంపీడీవో సమతావాణి సూచించారు. గురువారం తాడికొండ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జీఎస్టీ 2.0కు సంబంధించిన క్యాంపెయిన్‌ను ప్రతి పంచాయతీలో నిర్వహించి కేంద్రం తగ్గించిన జీఎస్టీతో సామాన్యులకు జరిగే లాభాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. మండలంలో ఉపాధి సోషల్ ఆడిట్ టీం పరిశీలన, గ్రామసభల ప్రక్రియ పూర్తైందని, మండల పరిషత్ కార్యాలయంలో పబ్లిక్ హియరింగ్‌లో సోషల్ ఆడిట్ నివేదికను వెల్లడించే అవకాశం ఉండటంతో అందరూ హాజరు కావాలని సూచించారు. ఈ నెల 13, 15, 17 తేదీల్లో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు కార్యదర్శులు, క్లాప్ మిత్రలు, గ్రీన్ అంబాసిడర్‌లు, స్వయం సహాయక బృందాల సభ్యులకు మండల పరిషత్ కార్యాలయంలో సంపూర్ణ శిక్షణ అందించనున్నారు కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోఆర్డీ అరుణ్ కుమార్, పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.



కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సమతావాణి

డివిజన్ స్థాయి క్రీడాపోటీలకు ఎంపిక

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని చిర్రావూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు డివిజన్ స్థాయి క్రీడాపోటీలకు గురువారం ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇ.అరుణశ్రీ మాట్లాడుతూ గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన తాడేపల్లి మండల స్థాయి క్రీడా పోటీలు, సెలక్షన్లు పెనుమాకలో నిర్వహించారని తెలిపారు. అండర్ 17 బాలికల విభాగం.. కబడ్డీలో టి. శ్రావ్య, సీహెచ్ సిరివెన్నెల, ఖోఖోలో ఎస్. కావ్య, జి. మౌనిక ఎంపికయ్యారని పేర్కొన్నారు. బాలుర విభాగం.. ఖోఖోలో కె.శశాంత్, ఎం.సంతోష్, వాలీబాల్ విభాగంలో పి. వెంకట్, అండర్ 14 బాలికల విభాగం.. ఖోఖోలో యశస్విని, బాలుర విభాగం కబడ్డీలో పి. సాత్విక్, డి. చేతన్, ఖోఖోలో కె.నిఖిల్, అక్షయ బాబు, చేతన్, పి.సాత్విక్ ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను పాఠశాల పి.డి. ఎం. సూర్యప్రకాశరావు, ఉపాధ్యాయులు, లాల్‌చంద్, భవాని, సుబ్బారావు తదితరులు అభినందించారు.



మండల స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఫాతిమా షేక్ జీవితం స్ఫూర్తిదాయకం

దుగ్గిరాల: స్త్రీ విద్య, అభ్యున్నతికి, మహిళాహక్కుల కోసం, తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త ఫాతిమా షేక్ ఎంతో కృషి చేశారని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం మాజీ కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. గురువారం దుగ్గిరాలలోని ముర్తాజానగర్‌లో ముస్లిం నాయకులు ఫాతిమా 125వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం షేక్ సుభాని మాట్లాడుతూ దేశంలో తొలి ముస్లిం ఉపాధ్యాయురాలిగా, గొప్ప సంఘ సంస్కర్తగా ఫాతిమా షేక్ ఎన్నో సేవలు చేశారన్నారు. ఆమె సేవలను రాష్ట్ర ప్రభుత్వం కూడా గుర్తించి 8వ తరగతి తెలుగు పాఠ్య పుస్తకంలో ఆమె జీవిత చరిత్రను చేర్చి తగిన గౌరవాన్ని కల్పించిందని వివరించారు. కార్యక్రమంలో జాను సాహెబ్, జిలాని, జుల్ఫకర్ ఆలీ, మస్తాన్, యేల్లేశ్వరరావు, కుమార్ పాల్గొన్నారు.



ఫాతిమా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

నేడు కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ

మంగళగిరి టౌన్: రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం పోస్టర్‌ను ఆవిష్కరించనున్నట్లు మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళగిరి నగర పరిధిలోని ఆత్మకూరు బైపాస్ వెంబడి ఉన్న నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు పోస్టర్ ఆవిష్కరణ జరుగుతుందని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డివిఆర్), మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహనరావు హాజరు కానున్నారని, నియోజకవర్గ పరిధిలోని అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొనాలని కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం

తాడికొండ: క్రీడలతో విద్యార్థుల్లో శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసాన్ని పెంపొందించవచ్చని చార్టెడ్ అకౌంటెంట్ ముప్పవరపు కృష్ణారావు అన్నారు. గురువారం తుళ్ళూరు మండలం మందడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల పూర్వ విద్యార్థిగా దాని సర్వతోముఖాభివృద్ధికి పాటుపడటం తన బాధ్యత అన్నారు. పాఠశాలలో క్రీడా సామగ్రి కొనుగోలు నిమిత్తం రూ.40 వేలు, స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిఫాం కొనుగోలుకు రూ.60 వేలు కలిపి మొత్తం రూ. లక్ష వితరణ అందజేశారు. పీ-4లో భాగంగా తాను నలుగురు విద్యార్థులను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో హెచ్ఎం తుర్లపాటి నగేష్, పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



పాఠశాల ఉపాధ్యాయులకు రూ.లక్ష విరాళం అందజేస్తున్న దాత ముప్పవరపు కృష్ణారావు

నేటి నుంచి కేఎల్‌యూలో జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో జాతీయస్థాయి సాంకేతిక ఉత్సవం సమ్యక్ 2025 వేడుకలను ఈ నెల 10,11 తేదీల్లో రెండు రోజుల పాటు జరగనున్నాయని వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా 23 రాష్ట్రాల నుంచి ఆయా కళాశాలలు, యూనివర్సిటీలకు చెందిన సుమారు 25 వేలకు పైగా విద్యార్థులు హాజరు కానున్నారని వివరించారు. సమ్యక్ 2025 చైర్మన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ మాట్లాడుతూ ప్రదర్శనలో 450కు పైగా విద్యార్థులు ప్రాజెక్టులు, అత్యాధునిక ఆవిష్కరణలను, పరిశోధనలను ప్రదర్శించే వాస్తవ, ప్రపంచ నమూనాలను ప్రదర్శించనున్నామని తెలిపారు. 3 వేలకు పైగా పరిశోధనా పత్రాలు, పోస్టర్‌లను ప్రదర్శించనున్నారని, హ్యాకథాన్‌లు, కేస్ సవాళ్లు, నిపుణుల చర్చలు, హ్యాండ్స్ ఆన్ మేకర్ సెషన్‌లతో కూడిన 256 సాంకేతిక వర్క్‌షాపులతో పాటు వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం సాంకేతిక సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌డి డీన్ డాక్టర్ బీటీపీ మాధవ్, సమ్యక్ 2025 కన్వీనర్లు ప్రిన్సిపల్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ డాక్టర్ వి.రాజేష్, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం. కిషోర్‌బాబు, ఎఫ్ఈడీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేఎల్‌యూ ఆచార్యులు

ట్రై సైకిళ్లు పంపిణీ

తెనాలి అర్బన్: వ్యాపారి గుమ్మడి వెంకటనారాయణరావు కుమారుడు పూర్ణచంద్ పుట్టిన రోజును పురస్కరించుకుని గురువారం సాయంత్రం రెండు ట్రై సైకిళ్లను దివ్యాంగులకు తెనాలిలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో రావూరి శ్యామ్‌బాబు, చిగురుపాటి సుబ్బారావు, కుర్రా శ్రీనివాసరావు, వాకా సుబ్బారావు, కె.శ్రీనివాస్, టి.పోతురాజు, టి.చంటి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఐదుగురికి గాయాలు

కొల్లిపర: తూములూరు, కొల్లిపరలలో వీధి కుక్కల దాడిలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం చోటుచేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తూములూరు గ్రామ శివారు యాదవపాలెంకు చెందిన మహిళ, బాలిక, కొల్లిపర గ్రామానికి చెందిన బసవ పున్నారెడ్డి, గంగోత్రి , శివయ్య తదితరులపై కుక్కలు దాడి చేశాయి. దీంతో తీవ్ర గాయాలతో కొల్లిపర సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స తీసుకుంటున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ వీధి కుక్కలు ఎక్కువయ్యాయని చెప్పారు. తహసీల్దార్, ఎంపీడీవోలు చర్యలు తీసుకోవాలని కోరారు. కొల్లిపర గ్రామంలో వారం నుంచి సుమారు ఐదుగురు గాయాలు పాలయ్యారు. బుధవారం మరో వ్యక్తిపై కుక్కలు దాడి చేయటంతో ప్రజలు బయటికి రావాలంటే భయపడుతున్నారు.

కార్మిక సమస్యలపై యాజమాన్యం స్పందించాలి



తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్య పరిష్కరించడంలో యాజమాన్యం ఇప్పటికైనా స్పందించాలని యూనియన్ నేత కూరపాటి స్టీవెన్ విజ్ఞప్తి చేశారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానంద పురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలిపారు. స్టీవెన్ మాట్లాడుతూ 310 రోజులుగా కార్మికులు దీక్షలు నిర్వహిస్తున్నారని, యాజమాన్యం కానీ ప్రభుత్వం కానీ స్పందించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో షేక్ సుభాని, ఆశీర్వాదం, కార్మికులు శివకుమారి, ఇమాంబీ, రమణమ్మ, కాశమ్మ, వై. సాంబశివరావు, తుపాకుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.